

## గంగమ్మ చెల్లి సరయూ


అయోధ్యలోని సరయూ నది గంగ అంత పవిత్రమైనది. గంగ శ్రీహరి కుడి పాదం నుంచి ఉద్భవిస్తే... సరయు ఎడమ పాదం నుంచి పుట్టిందని విష్ణు పురాణం చెబుతున్నది. బ్రహ్మ నుంచి ఆవిష్కృతమైన మానస సరోవరం నుంచి సరయూ ప్రవాహం మొదలవుతుంది. రాముడు స్నానం చేయడంతో సరయూ మరింత పవిత్రతను సంతరించుకుందని భాగవతుల విశ్వాసం. చివరికి రాముడు అవతార పరిసమాప్తి చేసింది కూడా సరయూలోనే. శ్రీరామ నవమి (చైత్ర శుద్ధ నవమి) నాడు సర్వతీర్థాలూ అయోధ్యకు చేరుకుంటాయట. వేదాలు తమ శక్తులతో సరయూలోకి ప్రవేశిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. దేవతలు, మునులు నదిలో స్నానం చేసి తరిస్తారట. తులసీదాసు 'రామచరిత్ మానస్' కావ్యాన్ని శ్రీరామ నవమి నాడే, సరయూ ఒడ్డునే ప్రారంభించాడని తెలుస్తున్నది. ఇంతటి పవిత్రమైన నదీమతల్లి దర్శనం, అందులో పుణ్యస్నానం జన్మకో అదృష్టం.

రథ మహారాజా! మీ కుమారుడు సకల కల్యాణ గుణాలకు పెన్నిధి. దైవతుల్యుడు, ధీశాలి. ఈ లోకంలో రాముడి వంటి సత్పురుషుడు మరొకడు లేదు. శ్రీరాముడు చంద్రుడిలా ప్రజలకు ఆహ్లాదకారుడు. బుద్ధిలో బృహస్పతి, పరాక్రమంలో సాక్షాత్తూ ఇంద్రుడు' అని సభలోని వారంతా రాముణ్ని తామెంతగా ఆరాధిస్తున్నారో ప్రకటించారు. రాముడిపై అయోధ్యవాసులకున్న అభిమానం ఎంతటిదో మరోసారి నిరూపితమైంది. 'రేపే రాముడికి పట్టాభిషేకం' అని ప్రకటించాడు దశరథుడు. తమ కంటి ముందుపెరిగిన చంటిపాప.. తమను కంటికిరెప్పలా కాపాడే రాజవుతున్నాడని అయోధ్య పులకించింది. ఆ రోజంతా సంబురాలే. ప్రతి ఇంటా సందడే. వీధి వీధంతా జనాలే. రామచంద్రుడి నివాసానికి తండోపతండాలుగా ప్రజలు రాసాగారు. ఏ గవాక్షంలో నుంచైనా రాముడి కొనచూపైనా సోకకపోతుందా అని ఆశపడ్డారు. పట్టాభిషేకానికి ఏ విఘ్నాలూ రాకూడదని తమ ఇష్టదేవతలను పూజించారు. దారికి ఇరువైపులా అరటిబోదెలు కట్టి.. పచ్చతోరణం చుట్టారు. ఎప్పుడెప్పుడు సూర్యుడు ఉదయిస్తాడా అని ఎదురుచూడసాగారు. రాత్రి జాములు దాటుతున్నా.. ఇండ్లను అలంకరిస్తూ కాలం గడిపారు. పొద్దుపొడవకముందే వాకిట్లో కస్తూరి కలిపి కల్లాపి చల్లారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. మంగళవాద్యాలు మోగించారు. జానపదులు పాటలతో హోరెత్తించారు. రాముడి రాకకై వేయికండ్లతో ఎదురుచూస్తూ... రోజంతా గడిపారు.

### వెడలెను కోదండపాణి..

'తామొకటి తలిస్తే.. దైవం మరొకటి తలచిందని' సామెత. పితృవాక్య పరిపాలన కోసం రాముడు 14 సంవత్సరాలు అడవికి వెళ్తున్నాడు అని తెలిసి అయోధ్య ఘొల్లుమన్నది. రాముడు రాజు అవుతాడన్న తమ కలలు కల్లలయ్యాయని కన్నీళ్లు పెట్టుకున్నారు ప్రజలు.

ప్రవేశ ద్వారాలు: 12



## ధర్మ నిలయమ్ము.. అయోధ్యా పురమ్ము

**మన తెలుగింటి కవయిత్రి మొల్ల అల్లిన సీసపద్యం.. నగరాల్లో కెల్లా అయోధ్య కొల్లని చాటుతూ ఉల్లాన్ని జల్లున పొంగిస్తుంది.**

సీ॥ సరయూ నదీ తీర సతత సన్మంగళ<br>
ప్రాభవోన్నత మహా వైభవమ్ము<br>
కనక గోపుర హర్మ్య ఘన కవాటోజ్జ్వల<br>
త్ప్రాకార గోపుర శ్రీకరమ్ము<br>
గజవాజి రథ భట గణికాతపత్ర<br>
చామరకేతు తోరణ మండితమ్ము<br>
ధరణీ వధూటి కాభరణ విభ్రమ రేఖ<br>
దరిసించు మాణిక్య దర్పణమ్ము

తే॥ భానుకుల దీప రాజన్య పట్టభద్ర<br>
బాసి నవరత్న ఖచిత సింహాసనమ్ము<br>
నాగనుతికెక్కు మహిమ ననారతమ్ము<br>
ధర్మనిలయమ్ము, మహి నయోధ్యాపురమ్ము

'సరయూ నదీతీరంలో ఉన్న ఆ అయోధ్యాపురం ఎల్లప్పుడూ వైభవంతో ఎక్కువ ప్రాభవాన్ని కలిగి ఉంది. బంగారు గోపురాలు, ఏనుగులు, గుర్రాలు, రథాలు, భటులు, గొడుగులు, చామరాలు పట్టేవాళ్లు.. అన్నిటా మిన్నగా నిలుస్తూ మాణిక్యానికి దర్పణం పడుతున్నది. ఈ అవనిలో ధర్మ నిలయమై విలసిల్లుతున్నది' అని అయోధ్యను పదాడంబరంతో భావస్ఫోరకంగా వర్ణించింది మొల్ల.

ఛత్రఛాయలో ఉండాల్సిన రాముడు.. నారచీరలు ధరించడాన్ని భరించలేక పోయారు. అంతఃపుర రాజకీయాల గురించి చెవులు కొరుక్కున్నారు. ఎవరికి వారే రాముడి వెంట అడవికి వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. 'రాముడు అడవికి వెళ్తే.. ఇక్కడుండి ఏం చేస్తాం.. మనమూ వెళ్లిపోదాం. రాఘవుడున్న నెలవే అయోధ్య. ఆయనతోనే మనకు సయోధ్య' అని నిశ్చయించుకున్నారు. సీతాలక్ష్మణ సమేతుడై రథమెక్కాడు రాముడు. రథం కదులుతున్నది. మదుపుటేనుగులు కోపంతో ఘీంకరించాయి. గుర్రాలు పాదాలపై నిలవక తత్తరపాటుగా కదిలాయి. పిల్లలు, పెద్దలు, మూడుకాళ్ల ముసళ్లు కూడా రథం వెంట నడవసాగారు. తనను అందుకోవాలన్న ప్రజల యాతన చూసి రథాన్ని నెమ్మదించమన్నాడు రాఘవుడు. 'ఒక్కసారి రామయ్య ముఖం చూడనివ్వండి..' అంటూ రథం వెంట పరుగులు తీశారట కొందరు. రాఘవుడు వెళ్లింది మొదలు అయోధ్య సౌభాగ్యం కోల్పోయింది. ఆవులు పాలు ఇవ్వడం మానేశాయట. లేగలు పాలు తాగడం మర్చిపోయాయట. సూర్యుడు త్వరగా అస్తమించాడట. పిల్లలు తినడం మానేశారట. తల్లులు వంట చేయడం ఆపేశారట. అగ్నిహోత్రం ఆరిపోయిందట. రాముడి వెంట వెళ్లిన వాళ్లు మర్నాడు తిరిగి వస్తే.. వారిని అందరూ నిందించారట. 'ఏం సాధించాలని వెనక్కి వచ్చారు' అని పెదవి విరిచారట. ఇవీ రాముడిపై అయోధ్యవాసులకు ఉన్న ప్రేమాభిమానాలు.

### శుభస్వాగతం ప్రియపరిపాలకా..

రామ విరహంతో విలపించిన అయోధ్య కళ తప్పింది. తమ ప్రభువు లేక అయోధ్యవాసులు కుంగిపోయారు. కానీ, అయోధ్య రాముడు ఎక్కడ అడుగు పెడితే అది క్షేత్రమవుతుందని వాళ్లకు వాళ్లు సముదాయించుకున్నారు. రాముడు మునకేసిన నీళ్లు తీర్థాలు అవుతాయని మనసుకు సర్దిచెప్పుకొన్నారు. 14 ఏండ్లు గతించాయి. రాముడు వచ్చాడు. సీతాసమేతంగా వచ్చాడు. రావణాసురుణ్ని అంతమొందించి జగదభిరాముడిగా వచ్చాడు. అవతార లక్ష్యం నెరవేర్చుకొని అయోధ్య పాలనకు మళ్లీ వచ్చాడు. పట్టాభిరాముడు అయ్యాడు. అయోధ్యవాసుల ఆనందం అంతా ఇంతా కాదు. ధర్మపాలనలో తరించింది అయోధ్య. నెలకు మూడు వానలతో పసిడి పంటలు పండాయి. ధర్మమూర్తి పాలనతో రాజ్యమంతా ధర్మమే. అన్యాయం లేదు, వ్యాధుల్లేవు, దొంగల్లేరు, వంచకుల్లేరు, పిల్లలకు కర్మ చేయాల్సిన దుస్థితి పెద్దలకు పట్టలేదు, అకాల మరణాల్లేవు. ఆనందమూర్తి పాలనలో అయోధ్య ప్రజలు బ్రహ్మానందం పొందారు. రామరాజ్యం యుగయుగాలకు ఆదర్శ రాజ్యమైంది. శ్రీరాముడి పరిపాలన... పాలకులకు పాఠమైంది.

ఇన్నాళ్లకు అయోధ్య కొత్తకళ సంతరించుకుంది. రాముడు పుట్టిపెరిగిన ప్రాంతంలో దివ్యమందిరం వెలిసింది. ఆ కోవెలలో కోదండపాణి బాలరాముడిగా కొలువుదీరుతున్నాడు. ఈ రాముడు ఎక్కడికీ వెళ్లడు. తరతరాలు నిలిచి ఉంటాడు. యుగయుగాలు అనుగ్రహిస్తాడు. ఈ పుణ్యం కేవలం అయోధ్యది మాత్రమే కాదు.. మన యావత్ భారతానిది. సమస్త హైందవానిది. సంపూర్ణ ప్రపంచానిది. మొత్తం విశ్వానిది. ■